# వసంతం ఎప్పుడు

"సార్! ఓ గంట పర్మిషన్ కావాలి!

ఉగాది పండుగ పనులున్నాయి. కాస్త మార్కెట్‌కి"- అంటూ నసిగింది సునీత.

చురుగ్గా చూశాడు శశిధర్!

"ఓహో మీకూ పండుగ హడావిడి ఉంటుందన్న మాట!" అన్నట్లున్నాయి అతని చూపులు.

"సారీసార్! మా ఫాదర్‌కు బాగోలేదు. డాక్టర్ దగ్గరికి తీసుకుపోవాలి" నెమ్మదిగా చెప్పింది కళ్ళు వాల్చేసి.

"మొన్న ఓ గంట ముందెళ్ళావు కదూ!" ప్రశ్నార్థకంగా అడిగాడు.

"అవును సార్ - మా అమ్మకు బాగోలేక పోతే!" నసిగింది.

"ఓకే! తీసుకో - కాని ఈ గంట పని ఇంకెప్పుడన్నా చెయ్యి" దృఢంగా అన్నాడు.

రాబోయే కన్నీటిని ఆపుకుంటూ బయటకు నడిచింది సునీత.

ముష్టి ఆరువందలు! జస్ట్ సిక్స్ , హండ్రెడ్ రుపీస్! అందుకని బండెడు చాకిరీ చేయాలి. ఒకరకంగా వెట్టిచాకిరీ చేయాలి. ఉదయం తొమ్మిదికి ఇంట్లో బయలుదేరి పదికి వస్తే రెండు దాకా క్షణం ఊపిరి ఆడదు. పనే! పని! లంచవర్ ఒక గంట సరిగా కూడా రెస్టు తీసుకోలేదు. మళ్ళీ సాయంత్రం దాకా వర్క్!

ఏ రోజు పని ఆ రోజు పూర్తికావాలంటాడు బాస్! కొంపలంటుకు పోయినట్లు బాధపడతాడు - కాస్త పెండింగ్ పడ్డా.

ఆలోచిస్తున్న ఆమె కాళ్ళు అయాచితంగా బస్టాండ్ వైపు నడుస్తున్నాయి.

కొవ్వెక్కిన మగవెధవలు కొందరు ఆమెను తోసుకుంటూ వెళుతున్నారు. కానీ అదేమీ ఆమెని బాధించడంలేదు. ఎందుకంటే వాటన్నిటికి ఆమె అలవాటుపడిపోయింది. బాధపడి ప్రయోజనం లేదని తెల్సుకుంది.

పేరుకు ఆరొందలు అన్నమాటే కాని రెండొందల దాకా బస్సుకని - బస్సు రానప్పుడు ఆటోలకని - నిరీక్షణలో అలసిపోయినప్పుడు సేవించే కాఫీ - టీలకు అని హారతి కర్పూరంలా కరగిపోతుంటాయి.

మిగిలింది చాకిరి!

ఓ గంటకు నానా కష్టాలుపడి ఇల్లు చేరుకోగలిగింది. నిజానికి ఆమె శరీరం ఆమె స్వాధీనంలో లేదు.

కానీతల్లి రాగానే ఆదుర్దాగా చెప్పింది.

"ఒసేయ్! సునీ! మీ నాన్నకు జ్వరం జాస్తీ అయింది.

"ఇపుడన్నా డాక్టరు దగ్గరకు తీసుకుపో - ఓ గంట ముందు రమ్మన్నా కదా!" విసుక్కుంటూ ఆదుర్దాగా అంది.

సునీతకు కోపం వచ్చినా - మునిపంటితో కోపాన్ని అదుముకుంది.

తండ్రి పరిస్థితి చూసి రిక్షా పిలిచింది. రెండు ఫర్లాంగులు పోవడానికి వాడుఅయిదు రూపాయలు అడిగాడు. అయినా తప్పదు.

డాక్టరు దగ్గర బోల్డు రష్షు! ఉష్షూ అంటూ కాసేపు ఎదురుచూసింది. జనం తగ్గి తమవంతు వచ్చేసరికి ఎంతలేదన్నా ఇంకో గంట పట్టేట్టుంది.

ధైర్యంచేసి నేరుగా లోపలికి దూరింది. డాక్టర్ సహదేవుడు అసహనంగా చూశాడు ఆమెవైపు.

"సార్! ఫాదర్‌కు, జ్వరంఎక్కువగా ఉంది. చలికి ఒణుకుతున్నారు" మొహం మీద చిరునవ్వు అద్దుకుని చెప్పింది.

"లోపలికి తీసుకురా" విసుగ్గా అన్నాడు డాక్టర్.

ఆ ఏకవచన సంబోధనకు కోపం వచ్చినా - మౌనంగా తండ్రిని తీసుకొచ్చి చూపించింది.

ఓ రెండు నిముషాలు చూసి ఓ కాగితం నిండా మందులుగీకాడు.

"మీ ఫీజు", అంటూ ఇరవైనోటు తీసింది.

"ముప్పై", నిర్మొహమాటంగా చెప్పాడు డాక్టర్.

అసహనంగా తీసి యిచ్చింది.

రెండు నిముషాల పనికి ముప్పై రూపాయలు!

ఎందుకింత వ్యత్యాసం!

శ్రమకు విలువ లేదా?

డాక్టరు చెప్పిన మందుల షాపుకొచ్చి మందులు కొనేసరికి పర్స్ ఖాళీ! యాభై రూపాయలు చిల్లర మందులకు అయింది.

అదే షాపులో ఎందుక్కొనాలి!

కమీషన్ ముడుతుందా డాక్టర్‌కు? అనుమానం! షాపువాడినడిగి మందుల గూర్చి తెలుసుకుంది. అవి రెండు మూడు జబ్బులకు పని చేసే మందులు.

అంటే తండ్రికి వచ్చింది ఈ జబ్బు అని నిర్ధారించలేక అనుమానంగా ఉన్న రోగాలన్నిటికి కలిపి మందులు రాసేశాడు. పోతే పోయేది పేషెంటేగా!

నీచం! దారుణం!

అన్ని మందులూ మింగినా తండ్రి మూలుగు వినిపిస్తూనే ఉంది రాత్రంతా!

నెలంతా కష్టపడి సంపాదించిన డబ్బును ఎవరో ఓ పది నిముషాల్లో దోచుకుపోయినట్లు కలలు. సునీతకు అన్నీ ప్రియమే!

ఫీజులు - రిక్షా చార్జీలు - మందులు - అన్నీ ప్రియమే! జీతం మటుకు అప్రియమే!

కలల రాతిరి - కలతల రాతిరితో సునీతకు తెల్లవారిపోయింది.

మండుతున్న కళ్లతో పదీపదికి ఆఫీసుకు చేరింది. అప్పటికే బాస్ చిందులు తొక్కుతున్నాడు.

"వాటీజ్ దిస్! ఇప్పుడు టైమెంతయిందో తెల్సా! ఇలా లేటుగా వస్తే ఐ విల్ డిస్‌మిస్‌యూ"

'సార్! బస్..!"

"షటప్! డోంటాక్ నాన్సెన్స్!"

బలవంతాన రాలబోతున్న కన్నీటిని అదుముకుంది సునీత.

"ఇట్సాల్‌రైట్! నేను వంట మనిషిని చూడమని నెల క్రిందట చెప్పాను. చూశావా? ఊహూ! లేదు. ఇవ్వాళ ఉన్న వంట మనిషి కాస్త మానుకుని వెళ్లిపోయింది. కాఫీ ఎవరు చేస్తారనుకున్నావ్? వంట ఎవరు చేస్తారనుకున్నావ్? మీ తాత?" కోపంగా అరిచాడు.

"సార్! ఇద్దరు, ముగ్గుర్ని చూశాను కానీ - వాళ్లు మీరు చెప్పిన నాలుగు వందలకు రానన్నారు". 'నంగి నంగిగా చెప్పింది.

"నాలుగు వందలు కాకపోతే ఐదొందలు-ఉ అదీ కాకపోతే యింకో వంద వాళ్ల

బొందన పారేస్తాను. ముందు వాళ్ళని తెస్తే నే మాట్లాడేవాణ్ణిగా- నువ్వే వాళ్ళని వద్దని చెబితే - వాటీజ్ దిస్!" ఎర్రబారిన మొహంతో శశిధర్ అంటున్నాడు.

"సార్ వాళ్ళు వేరేచోట్ల కుదిరిపోయినట్లున్నారు..."

"నో! ఐడోంట్ వాంట్ ఎనీ డిస్కషన్ - రేపటికల్లా నువ్వు ఓ వంట మనిషితో రావాలి - దట్సాల్! ఇంటికి మైనర్ రిపేర్లు చేయాలని చెప్పి నీకు ఎన్నాళ్లయింది. యు ఆర్ యిర్రెస్పాన్సిబుల్" 'అరుచుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు.

మొద్దుబారిన మెదడుతో కూర్చుండిపోయింది. లేచిన వేళా విశేషం బాగోలేదు. అలా ఎంత సేపు ఉందో - "అమ్మా! సునీత నాకో చిన్న ఉపకారం చేసి పెట్టాలమ్మా", అత్తరు వాసన గుబాళిస్తూ గౌరి వచ్చింది లోపలికి.

గబాల్న లేచి నిల్చుంది.

గౌరి చాలా అందంగా ఉంటుంది. పచ్చటి మేని ఛాయ. నాజూకైన శరీరం, మంచి పొంకం గల అందం! చెంపకు చారడేసి కళ్ళు.

సహజ వర్చస్సును రెట్టింపు చేస్తూ బ్యూటీషియన్ల సలహాలను పాటిస్తూ - ఆమె వేసుకునే దుస్తులు - చేసుకునే అలంకరణ - చూపరులను రెప్ప వాల్చనీయవు.

"చెప్పండి." మొహం మీద చిరునవ్వు పులుముకుంటూ అంది.

"నేను వంట మరచిపోయి చాలా సంవత్సరాలైంది. పొద్దున నేను చేసిన కాఫీకే ఆయన హడలిపోయి - ఆ కోపమంతా నీ మీద చూపినట్లున్నారు. అందుకని కాస్త వంటలో సాయం చేస్తావా అమ్మా!" ఎంతో మృదువుగా బ్రతిమాలుతూ అడిగింది.

అవతలివాళ్లతో పనులు చేయించుకోవడం ఆమెకు వెన్నతో పెట్టినవిద్య. సునీతకు ఆమె గురించి తెలుసు పూర్వ అనుభవాల వలన. ముందు సాయం అంటుంది. తర్వాత ఫోన్ వచ్చిందని - ఎవరో తన కోసం వచ్చారని చెప్పి మొత్తం పని తన మీద పడేసి వెళ్ళిపోతుంది. చివరికి ఆఫీసులోనే కాక ఇంట్లో కూడా బాస్‌తో చివాట్లు తినాలి.

"గంగ పన్లోకి రాలేదాండి?!" ఆశ్చర్యంగా అంది.

"లేదు సునీతా! మానుకుంది - దానికెంత పొగరని - నిన్న ఒక్క మాటన్నా - ఈ మధ్య నీ వంట బాగోటంలేదు, కానీ షోకులు మటుకు ఎక్కువయ్యాయని - అంతే! అట్లకాడ గరిట నా మొహాన విసిరేసి పోయింది" చెప్పింది గౌరి.

"వీళ్ళిచ్చే ముష్టి మూడొందలకు ఎవరుంటారు కనక" స్వగతంగా అనుకుంది.

"అయినా అది పోవడమే మంచిదిలే - నీక్కాబట్టి చెబుతున్నా - దాని కన్ను మా ఆయనమీద పడిందని నా అనుమానం - దాని చూపులు - ఇక ఇకలు - పకపకలు - అబ్బా - చెప్పలేం." ఈర్ష్యగా అంది గౌరి!

సునీతకు నిజంగా మతిపోయింది. కాటుక కొండలా ఉంటుంది 'గంగ'. దానికి తోడు గారపట్టిన పళ్ళు - లావెక్కిన ఒళ్ళు - గౌరిగారితో గంగని పోలిస్తే గంగ ఆమె కాలిగోటికి కూడా పనికిరాదు - అయినా అనుమానం!

"ఒట్టు! అంత పిచ్చిముండలా ఉంటుంది - ఎందుకు నా అనుమానం అనా! ఈ మొగాళ్ళని నమ్మడానికి లేదు - అందని ద్రాక్షపళ్ళు తియ్యన - అందినవి పుల్లగా ఉంటాయి వీళ్ళకి - సర్లేమ్మా - కొంచెం వంటగదిలోకి వచ్చి సాయంచేస్తే."

"ఆఫీసు పని చాలా ఎక్కువగా ఉంది - మీకు సాయం చేసి - పనికాకపోతే - బాస్ తిడతారు." నసిగింది. తన కిష్టంలేదని తెలుపుతూ సునీత.

"ఆయన సంగతి నే చేసుకుంటాగా - ఈగ వాలనివ్వను - నీ మీద . ఒక్కదాన్నే

చెయ్యి కాల్చుకోవాలంటే కష్టంగా ఉంది." గౌరి ఎంతో బాధపడిపోతూ చెప్పింది.

ఎలాగూ వంటంతా తనపైన పడేసి తాను వెళ్ళిపోతుంది - ఆ అవమానం భరించడం కంటే-

"మీకెందుకులెండి శ్రమ - నేనే చేస్తాను - మీరు రెస్టు తీసుకోండి." తన గౌరవం కాపాడుకుంటూ చెప్పింది.

"థాంక్స్ సునీత! నాకు చాలా పనులున్నాయి. - ఆ మాత్రం మానవత్వం ఉన్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది" గౌరి సంబరపడ్తూ చెప్పింది.

ఓ రెండు గంటలు ముందు బయలుదేరి బస్టాపు కొచ్చింది సునీత. బస్సుకోసం నిరీక్షిస్తున్నారు వసంత, మాలిని, మల్లిక తదితరులు.

వాళ్ళంతా ఉద్యోగస్తులే - కొందరు చిన్న స్కూళ్ళల్లో పనిచేస్తారు -కొందరు కాన్వెంట్‌లో టీచర్లు - కొందరు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు వెలగబెడుతున్నారు.

కొందరికి ఐదొందల జీతం అయితే - మరికొందరికి వెయ్యి లోపే!

దాదాపు అందరూ పీ. జీ చేసినవాళ్ళే!

"సునీ! ఇంకెక్కడైనా ఖాళీలుంటే చెప్పు - ఈ కాన్వెంట్ టీచర్ జాబ్ మానేద్దామనుకుంటున్నాను."మల్లిక చెప్పింది.

"ఏం?" ఆశ్చర్యంగా అడిగింది సునీత.

"నువ్వే అదృష్టవంతురాలివి-ఆరొందలు వస్తాయి. నాకో ఐదొందలు-తొమ్మిది నుండి నాలుగుదాకా గొంతు చించుకుని అరవాలి. అంతటితో ఆగదుగా-రాత్రుళ్ళు చేతులరిగేలా నోట్సులు తయారుచేయాలి - అంతటితో ఆగదుగా - కరస్పాండెంట్ నుంచి తిట్లు-చివాట్లు తినాలి. తనేమో ఇంటర్ కూడా ఎంటర్ కాలేకపోయాడు. కాని మాలాంటి చదువుకున్నవాళ్ళకి - ఏటీ యమ్మే బిఎడ్ వాళ్లని, ఎమ్మే,యమ్.ఫిల్ వాళ్ళని పట్టుకుని లక్షలు సంపాదిస్తున్నాడు." తెగబాధపడిపోయింది.

తన ప్రాబ్లెం అందరికీ చెప్పింది అర్జెంటుగా ఓ వంట మనిషి కావాలి అని.

చివరికి వసంతకు తెల్సినవాళ్ళున్నారని తేలింది-అందుకని ఆమెతో పాటు వంట మనిషి దగ్గరికి పోవడానికి నిశ్చయించుకుంది.

కిందా మీద పడుతూ- పార్వతమ్మ దగ్గరికి వచ్చారు.

"చూడమ్మా! ఆరొందలు తగ్గితే నా దగ్గరకు రావద్దు.రెండుపూట్లకాఫీ-టిఫిను-భోజనం-అన్ని యివ్వాలి. నే తిన్నానని ఏడవకూడదు. ఇది బాగోలేదు. అది బాగోలేదు అని పేర్లు పెట్టకూడదు" పార్వతమ్మ తన షరతులన్నీ వివరించింది కూలంకషంగా! అంటే నగదు రూపంలో పన్నెండొందలు పై చిలుకే ఆమె జీతం!

"అమ్మో! చాలా ఎక్కువ! మా బాస్ ఒప్పుకోడు." గుండెలు బాదుకుంది సునీత. అయినా తన కెందుకులే అని చెప్పింది. "రేపు ఉదయం నా వెంబడి రావమ్మా! వాళ్ళే మీతో మాట్లాడతారు."

సునీత ఆ రాత్రి ఓ చిన్న ఇంటి పనిచేసే తాపీ పనివాణ్ణి పట్టుకోవడంలో కృతకృత్యురాలైంది."రోజుకు యాభై యివ్వాలి. ఉదయం పది కొస్తాను. ఓ గంట రెస్టు. సాయంత్రం అయిదుకు దిగుతాను. చేసే పనిలో అడ్డు తగులకూడదు" కుర్ర నాగన్న కరుగ్గా చెప్పాడు. తలూపింది. రేపు ఉదయం తనతో రమ్మంది.

భయపడుతూ వాళ్ళని మర్నాడు బాస్ ముందు నిల్చోపెట్టి తను వంటిట్లో దూరింది. గొరికిసాయయంచేసే నెపంతో - ఆ తిట్లు-చివాట్లు ఎవరు పడతారని కాసేపటికి-

"సునీత-ఇక్కడేం చేస్తున్నావ్! ఆఫీసులో కూచుని నీ పని చెయ్యి. పార్వతమ్మ వస్తుందిలే వంటకు" కరుగ్గా అన్నాడు. శశిధర్ "డోంట్ వేస్ట్ యువర్ టైమ్"

"సార్ తాపీ పనివాడు" -నీళ్ళు నమిలింది సునీత.

'ఈ రోజే పని ప్రారంభిస్తాడు-థాంక్యూ సునీత.

సునీత ఓ అరగంట తర్వాత శశిధర్‌ని అడిగింది.

"సార్! నా జీతం కనీసం వెయ్యికి పెంచండి. యమ్మే పాసై పార్వతమ్మ కంటే - కుర్ర నాగన్నకంటే తక్కువ-"

'ఇష్టం లేకపోతే ఈ రోజే రిజైన్ చెయ్యి. నేను పైసా పెంచను. మాఆఫీసులో ఐదొందలకే చేస్తామని చాలామంది వెంట పడ్తున్నారు" కోపంగా అన్నాడు.

"వద్దులెండి సార్ - నేనే ఉంటా" అంది కన్నీళ్ళు ఆపుకొంటూ. "చీపెస్టు లేబర్ ఇన్ ఇండియా ఈజ్ ఎడ్యుకేటెడ్ లేబర్"

"ఈ ఎడ్యుకేటెడ్ లేబర్ జీవితాల్లో వసంతం ఎప్పుడో?" తనలో తాను గొణుక్కుంది.

ఆంధ్రప్రభ

